సాక్షి

అనంతపురం

శుక్రవారం । 23 । ఫిబ్రవరి । 2024



ఎస్‌ఐ అంత్యక్రియలు పూర్తి

అనంతపురం నగరానికి చెందిన ఎస్‌ఐ ఎన్. వెంకటరమణ అంత్యక్రియలు ఆయన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. IIలో



కిలో టమాట రూ.12

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్ఠంగా రూ.12, కనిష్ఠంగా రూ.4, సరాసరిన రూ.8 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
37.5°/17.1°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి వాతావరణం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జీవాలకు బీమా చేయించండి

- పశుశాఖ జేడీ సుబ్రహ్మణ్యం



అనంతపురం అగ్రికల్చర్: పాడి, పశుపోషణ, జీవాల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు, కాపర్లు, ఇతరత్రా లబ్ధిదారులకు ఆర్థిక భరోసా ఇస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు అమలు చేస్తోన్న వైఎస్సార్ పశుబీమాను జీవాలకు చేయించుకోవాలని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. 2 నుంచి 10 సంవత్సరాల వయసున్న నాటు ఆవులు, 3 నుంచి 12 సంవత్సరాల వయసున్న మేలు జాతి, సంకరజాతి పాడి పశువులు, పాడి గేదెలకు బీమా వర్తిస్తుందన్నారు. ఒకటిన్నర సంవత్సరం పైబడిన మేలుజాతి ఎద్దులు, దున్నలు, రెండేళ్లు పైబడిన నాటు ఎద్దులు, దున్నలకు బీమా ఉందన్నారు. 6 నెలలు పైబడిన గొర్రెలు, మేకలు, పందులకు కూడా బీమా వర్తిస్తుందని తెలిపారు. పాడి పశువు, గేదె విలువను బట్టి లబ్ధిదారులు తమ వాటా కింద 20 శాతం ప్రీమియం చెల్లిస్తే.. మిగతా 80 శాతం ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని పేర్కొన్నారు. బీమా పరిహారం కింద నాటు ఆవులు, గేదెలకు రూ.15 వేలు, మేలుజాతి, సంకరజాతికి ఒక్కో దానికి రూ.30 వేలు, గొర్రెలు, మేకలు ఒక్కో దానికి రూ.6 వేల ప్రకారం చెల్లిస్తారని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 13,250 పశువులకు రూ.17 కోట్ల బీమా చేయించారన్నారు. ఇందులో లబ్ధిదారులు తమ వాటా కింద 20 శాతం ప్రీమియం రూపంలో రూ.24.40 లక్షలు చెల్లించగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.70.73 లక్షల మేర జమ చేసిందన్నారు. మరిన్ని వివరాలకు పశుశాఖ అధికారులు, పశువుల ఆస్పత్రులు, ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించాలని ఆయన సూచించారు.

26న తాడిపత్రి రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు శ్రీకారం

- వర్చువల్‌గా పనులు ప్రారంభించనున్న ప్రధాని మోదీ

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 26న వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేయనున్నట్లు స్టేషన్ మేనేజర్ జి.అనిల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా 1,500 రైల్వేస్టేషన్లను ఆధునీకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందు కోసం ఒక్కో స్టేషన్‌కు రూ.5 కోట్లు కేటాయించిందన్నారు. వర్చువల్ పద్ధతిలో అన్ని రైల్వే స్టేషన్లలో పనులను ప్రధాని మోదీ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

ఫిజియోథెరపిస్టు పోస్టుల భర్తీకి దరఖాస్తులు

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష సహిత విద్య విభాగంలో ఖాళీగా ఉన్న రెండు ఫిజియోథెరపిస్టు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. తాత్కాలిక పద్ధతిలో పని చేయాల్సి ఉంటుందని సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత గల ఫిజియోథెరపిస్టులు https://possaatp.blogspot.com వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని పూరించిన అనంతరం ఈనెల 27లోగా అనంతపురంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

సీటా.. వెన్నుపోటా!

చంద్రబాబు ఎటూ తేల్చడం లేదు.. అలా అని నో చెప్పడం లేదు. దీంతో టీడీపీలో ఎవరికి వారు ప్రచారాలు చేసుకుంటున్నారు. డబ్బున్న వారికే సీట్లు అని ఇప్పటికే అధిష్టానం సూచనలివ్వడంతో పలువురు రగిలిపోతున్నారు. ఒక వైపు అధికార పార్టీ ఎన్నికల సమరంలో దూసుకుపోతుండగా.. ఇంకా టీడీపీ అధినేత నాన్చుడు ధోరణి అవలంభిస్తుండంపై నాయకులు తలలు పట్టుకుంటున్నారు. నమ్ముకుని జెండా మోసిన వారికి సీటిస్తాడో.. లేక వెన్నుపోటు పొడుస్తాడో తెలియక ఆందోళన చెందుతున్నారు. కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు మాత్రం తలోదారి చూసుకుంటున్నారు.



టీడీపీలో టికెట్ల లొల్లి

- ప్రతి నియోజకవర్గంలోనూ రెండు వర్గాలు
- ఎవరికి వారు తమకే టికెట్టు అంటూ ప్రచారం
- రోజురోజుకూ పెరుగుతున్న అసమ్మతి సెగలు
- కాంట్రాక్టర్‌ను తెచ్చి, భ్రష్టు పట్టిస్తున్నారన్న కళ్యాణదుర్గం నేతలు
- అనంతపురంలో పోటీగా ప్రచారం చేస్తున్న మైనార్టీ నాయకులు
- 'వరదాపురం' ప్రవర్తనపై అసంతృప్తితో రగిలిపోతున్న పరిటాల వర్గం
- గుంతకల్లులో 'కొత్త' పేరును జీర్ణించుకోలేక పోతున్న నాయకులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీలో అసంతృప్తి సెగలు రాజుకుంటున్నాయి. ఏ నియోజకవర్గంలో చూసినా పరిస్థితి చేయి దాటిపోయిందన్న మాటలే వినిపిస్తున్నాయి. టికెట్లు తేల్చకపోవడం, అధిష్టానం నుంచి భరోసా కూడా లేకపోవడంతో సీనియర్ నేతల్లోనే అసమ్మతి జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. అభ్యర్థి ఎవరో తెలియకుండా ఎలా పనిచేయగలమని ద్వితీయ శ్రేణి నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు అధికార పార్టీ ఎన్నికల ప్రచారం చేసుకుంటూ ఉంటే, టీడీపీలో తాము ఎవరి వెంట నడవాలో కూడా తెలియడం లేదని వాపోతున్నారు.

నువ్వే కాదు... నేనూ పోటీలో ఉంటా

'నువ్వు ఎలా పోటీచేస్తావో నేనూ చూస్తా.. నేను కూడా బరిలో ఉంటా' అంటూ అసంతృప్తులు తేల్చిచెబుతున్నారు. ఇప్పటికే కళ్యాణదుర్గంలో బడా కాంట్రాక్టర్‌ను తెరమీదకు తేవడంతో నియోజకవర్గ నాయకులు ఉమామహేశ్వర నాయుడు, హనుమంతరాయచౌదరి ఏకంగా మీడియా ముందుకు వచ్చారు. ఉన్నఫళంగా కాంట్రాక్టర్ ఇక్కడికొచ్చి పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని, ఇది పార్టీకి మంచిది కాదని ఎస్‌ఆర్‌సీ నిర్మాణ సంస్థ అధినేత అమిలినేని సురేంద్రపై భగ్గుమన్నారు. అనంతపురం అర్బన్‌లో సైతం గౌస్ మొహియుద్దీన్, జకీవుల్లా, మునిరత్నం వంటి నాయకులు ప్రభాకర్ చౌదరి పెత్తనమేంటి? మేమూ పోటీలో ఉంటాం అంటూ ఇంటింటి ప్రచారం చేపట్టారు. పుట్టపర్తిలో పల్లె రఘునాథరెడ్డికి పోటీగా పోలీసు అధికారి వేణుగోపాల్ వచ్చారు. గుంతకల్లులో కొత్త అభ్యర్థి తెరమీదకు వస్తున్నారన్న వార్తలను స్థానిక నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఇలా ప్రతిచోటా పోటీలో ఉండేవారు ఎవరో తేలకపోవడం.. రోజుకో కొత్త పేరు తెరపైకి రావడంతో కార్యకర్తలు గందరగోళంలో మునిగిపోయారు.

'పరిటాల' కంట్లో నలుసులా సూరి

ధర్మవరం నియోజకవర్గంలో బీజేపీ అయినా, టీడీపీ అయినా తానే అభ్యర్థిని అంటున్న వరదాపురం సూరిపై పరిటాల సునీత కుటుంబం ఆగ్రహంగా ఉంది. పార్టీకి ఎన్నో ఏళ్లు పనిచేశాం, కానీ కుటుంబానికి ఒకటే సీటు అంటూ తమను దూరం పెడుతున్నారంటూ తల్లీకుమారులు తమ సన్నిహితులతో ఉక్రోశం వెళ్లగక్కుతున్నట్లు తెలిసింది. నిన్న గాక మొన్న వచ్చిన సూరి కంటే తాము ఎందులో తక్కువ అంటూ కార్యకర్తల వద్ద సునీత ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. రోజుకో పార్టీ మారే వాళ్లకే చంద్రబాబు ప్రాధాన్యత ఇస్తున్నారని, జెండా మోసిన వాళ్లను పట్టించుకునే దిక్కులేదని వాపోతున్నట్టు తెలిసింది.

టికెట్ లేకుండానే ప్రచారం

టీడీపీలో పలు చోట్ల టికెట్లు తమకంటే తమకేనంటూ ప్రచారం చేస్తుండడం గమనార్హం. పెనుకొండలో సవితమ్మ, బీకేల్లో ఎవరికి సీటో తెలియదు.. కానీ సవితమ్మ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఈనెల 22 నుంచి పుట్టపర్తి నుంచి పల్లె రఘునాథరెడ్డి ప్రచారానికి వెళుతున్నట్లు సమాచారం. రాయదుర్గంలో మాత్రం టికెట్ తేలకపోవడంతో కేడర్ మొత్తం సందిగ్ధంలో ఉంది. మడకశిరలోనూ గుండుమల తిప్పేస్వామి వర్గం, ఈరన్న వర్గాలు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. చివరివరకూ చంద్రబాబు టికెట్లు తేల్చరని, దీనివల్ల పార్టీ నిండా మునిగిపోయే అవకాశముందని నాయకులు వాపోతున్నారు. బీఫాం ఇచ్చేది ఎవరికో చెబితే కిందిస్థాయి నాయకులు పార్టీ వీడతారన్న భయంతోనే చంద్రబాబు ఎటూ తేల్చడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

- కలెక్టర్ గౌతమి



మంత్రి బొత్స నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో డీవీఈఓ

అనంతపురం అర్బన్: ఇంటర్, 10వ తరగతి, డీఎస్సీ, టెట్ పరీక్షలు జిల్లాలో సజావుగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం తాడేపల్లి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి సూచనలిచ్చారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు డీఈఓ వరలక్ష్మి, డీవీఈఓ వెంకటరమణనాయక్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మార్చి 1వ తేదీ నుంచి 20 వరకూ జరగనున్న ఇంటర్ పరీక్షలు, మార్చి 18 నుంచి నిర్వహించనున్న 10వ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. కేంద్రాల వద్ద తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సెల్‌ఫోన్ ఫ్రీ జోన్‌గా ప్రకటించిన నేపథ్యంలో సిబ్బంది కూడా ఫోన్లు ఉపయోగించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు వీలుగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా పరీక్ష కేంద్రాల వద్ద ఆరోగ్య శిబిరం నిర్వహించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.

అభ్యర్థుల ఖర్చుపై పక్కాగా ఆడిటింగ్





మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జెడ్పీ సీఈఓ నిదియాదేవి, హాజరైన అధికారులు

- ప్రతి నియోజకవర్గానికి అకౌంట్లు ఏర్పాటు చేయండి
- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం

అనంతపురం అర్బన్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుకు సంబంధించి ఆడిటింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఎలెక్షన్ ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ టీం ఏఈఓలు, అకౌంటింగ్ టీమ్‌లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థులు రూ.95 లక్షలు, అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థులు రూ.40 లక్షలు ఖర్చు చేయవచ్చని ఎన్నికల కమిషన్ సూచించిందన్నారు. ఈ పరిమితి మించకుండా చూడాలని చెప్పారు. ఎన్నికల నిర్వహణలో భాగమైన వీఎస్‌టీ, వీవీటీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీఎంసీ, ఎంసీసీ, అసిస్టెంట్ ఎలెక్షన్ అబ్జర్వర్లు (ఏఈఓ), ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ బృందంతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. అభ్యర్థులు అనధికారికంగా చేసే ఖర్చుపై సూక్ష్మ పరిశీలన చేయాలని చెప్పారు. పోటీ చేసే అభ్యర్థుల వివరాలు అధికారుల వద్ద ఉండాలన్నారు. సున్నితమైనవిగా గుర్తించిన నియోజకవర్గాల్లో మరింత జాగ్రత్తగా ఉంటూ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి నియోజకవర్గానికి అకౌంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల నిర్వహణకు త్వరితగతిన సన్నద్ధం కావాలన్నారు. ప్రతి రోజూ వివరాలను ఏ ఫార్మాట్‌లో పంపాలి, ఆర్ఓ ఎన్ని రోజులకు ఒకసారి తనిఖీ చేయాలనే అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

వివిధ అంశాలపై శిక్షణ

అభ్యర్థుల ఎన్నికల ఖర్చుకు సంబంధించి వివిధ అంశాలపై అకౌంటింగ్ అధికారులకు ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ కమిటీ నోడల్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఆడిట్ అధికారి ఇందిర, లోకల్ ఫండ్ అధికారి శివారెడ్డి, జిల్లా కో- ఆపరేటివ్ ఆడిట్ అధికారి నాగరాజు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వైభోమ్ నిదియాదేవి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు 20 వేల మంది సిబ్బంది!

సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. షెడ్యూల్ వెలువడే నాటికి అన్ని విధాల సిద్ధంగా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపడుతోంది. ఎన్నికల నిర్వహణకు 20,106 మంది సిబ్బంది అవసరమవుతారని ప్రాథమిక అంచనా తయారు చేసినట్లు సమాచారం. పరిస్థితులను బట్టి ఈ సంఖ్య పెరగవచ్చని అధికారవర్గాలు స్పష్టం చేస్తున్నాయి. పోలింగ్ నిర్వహణకు 15,800 మంది, బందోబస్తుకు 3,200 మంది పోలీసుల సేవలను వినియోగించాలని నిర్ధారించారు. ఎన్నికల్లో కీలక పాత్ర పోషించనున్న ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్ఎస్‌టీ), స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీమ్ (ఎస్ఎస్‌టీ), వీడియో సర్వేలెన్స్ టీమ్ (వీఎస్‌టీ), మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ), వీడియో వ్యూవింగ్ టీమ్ (వీవీటీ)లలో 571 మందిని నియమించనున్నారు. నిర్వహణ కమిటీలకు 33 మంది నోడల్ అధికారులు, 241 మంది సెక్టోరియల్ అధికారులు, 241 మంది సెక్టోరియల్ పోలీసు అధికారులు మొత్తం 20,106 మందిని వినియోగించనున్నారు.

పేదలకు పౌష్టికాహారం

- మార్చి నుంచి రాగి పిండి పంపిణీ
- కిలో రూ.11 చొప్పున అందజేత
- జిల్లాకు 700 టన్నుల కేటాయింపు

అనంతపురం అర్బన్:పేదలకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా జగన్ సర్కారు పనిచేస్తోంది. రేషన్ కార్డుదారులకు ఇప్పటికే పోషక విలువలున్న ఫోర్టిఫైడ్ బియ్యం ఉచితంగా అందిస్తోంది. రూ.16కు గోధుమ పిండి ఇస్తోంది. ఈ క్రమంలోనే పేదలకు సంపూర్ణ పౌష్టికాహారం అందించేందుకు కిలో రూ.11తో రాగిపిండి పంపిణీకి శ్రీకారం చుట్టింది. మార్చి ఒకటి నుంచి కార్డుదారులకు పంపిణీ చేసేందుకు పౌర సరఫరాల శాఖ చర్యలు చేపట్టింది.

జిల్లాకు 700 టన్నులు

జిల్లాలో 6,69,632 బియ్యం కార్డులు ఉన్నాయి. కార్డుకు కిలో చొప్పున రాగిపిండి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా జిల్లాలో రాగుల వినియోగం 100 శాతం ఉందని ప్రభుత్వానికి అధికారులు నివేదిక ఇచ్చారు. దీంతో జిల్లాకు 700 టన్నుల రాగిపిండిని ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటి వరకు 300 టన్నులు (కిలో ప్యాకెట్లు 3 లక్షలు) చేరాయి. పౌర సరఫరాల సంస్థ వీటిని చౌక దుకాణాలకు చేరవేసింది. ఈ నెలాఖరులోగా మిగిలిన 400 టన్నులు వస్తుందని అధికారులు తెలిపారు.

మార్కెట్‌లో ఎక్కువగా ధర

మార్కెట్‌లో రాగుల ధర కిలో రూ.45 ఉంది. ఇక కిలో రాగిపిండి రూ.60 ఉంది. అయితే పేదలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో సబ్సిడీపై కేవలం రూ.11కే రాగిపిండిని ప్రతికార్డుకు కిలో చొప్పున అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం గమనార్హం.



ప్రభుత్వం పంపిణీ చేయనున్న రాగిపిండి ప్యాకెట్

చౌక దుకాణాలకు చేరవేశాం



బియ్యం కార్డుదారులకు ప్రభుత్వం మార్చి నెల నుంచి రాగిపిండి కిలో చొప్పున పంపిణీ చేయనుంది. జిల్లాలో 6.70 లక్షల బియ్యం కార్డులు ఉన్నాయి. 700 టన్నుల రాగిపిండిని ప్రభుత్వం కేటాయించింది. ఇందులో 300 టన్నులు ఇప్పటికే వచ్చింది. సరుకును చౌక దుకాణాలకు చేరవేశాం. మిగిలిన 400 టన్నులు వచ్చిన వెంటనే సరఫరా చేస్తాం.

– జె.రవీంద్ర, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ

వైభవంగా సునామ జకినీమాత జాతర



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని గుత్తి ఆర్ఎస్ రోడ్డులో వెలసిన ఆరె కటికల ఆరాధ్య దైవం సునామ జకినీమాత, మల్కామ జకినీమాత జాతర గురువారం అంగరంగ వైభవంగా సాగింది. ఉత్సవాలకు దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి ఆరె కటికలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దేశంలోనే మొదటి సారిగా 2003లో ఆరె కటికల ఆరాధ్య దైవం సునామ జకినీమాత ఆలయాన్ని గుత్తి ఆర్ఎస్‌లో నిర్మించారు.అప్పటి నుంచి ఏటా క్రమం తప్పకుండా మాఘ మాసంలో ఆలయ వార్షికోత్సవంతో పాటు జాతర ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో గురువారం జాతర ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము 4 గంటల నుంచే ప్రత్యేక పూజలు మొదలయ్యాయి. వందలాది మంది కన్యలు, ముత్తైదువులు గుత్తిలోని శిరిడి సాయిబాబా ఆలయం నుంచి పూర్ణ కుంభాలతో జకినీమాత ఆలయానికి భారీ ఊరేగింపుగా చేరుకున్నారు. భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆరెకటిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు, ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్‌రావు, సాయినాథ్, కోశాధికారి రామచంద్ర, గౌరవాధ్యక్షుడు మల్లేష్‌రావు, మహిళా గౌరవాధ్యక్షురాలు సరస్వతీబాయి, కార్యదర్శి లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.



పూర్ణ కుంభాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటున్న భక్తులు

కామాంధుడికి ఐదేళ్ల జైలు



అనంతపురం: కామంతో కళ్లు మూసుకుపోయి దివ్యాంగురాలిపై అత్యాచారానికి పాల్పడిన ముద్దాయికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ అనంతపురం నాల్గవ ఏడీజే కోర్టు జడ్జి శోభారాణి గురువారం తీర్పు వెలువరించారు. కేసు వివరాలు.. కూడేరు మండలం గొట్కూరు గ్రామానికి చెందిన హనుమంతు (55) ఓ దివ్యాంగురాలిపై 2019 డిసెంబర్ 29న అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిపై అప్పటి ఎస్‌ఐ యువరాజు కేసు (172/2019, ఐపీసీ 376) నమోదు చేశారు. సీఐ కృష్ణారెడ్డి దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అనంతపురం నాల్గవ ఏడీజే కోర్టు జడ్జి శోభారాణి విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి హనుమంతుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు. అలాగే, బాధితురాలికి రూ. లక్ష పరిహారం చెల్లించాలని ఆదేశించారు. దర్యాప్తు అధికారి కృష్ణారెడ్డి, ఎస్‌ఐ యువరాజు, ఏపీపీ సుజన, ఏఎస్‌ఐ ఓబుళపతిని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు.

గరుడ వాహనం అధిష్టించి.. భక్తులను కటాక్షించి



ప్రత్యేక అలంకరణలో రంగనాథుడు



గరుడ వాహనంలో కొండమీదరాయుడు

గుత్తి రూరల్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తొండపాడు బొలికొండ రంగనాథస్వామి గరుడవాహనంపై ఊరేగారు. శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ శివారులోని జమ్మిచెట్టు వరకు ఊరేగించారు. స్వామివారికి ప్రధాన అర్చకులు పలుకూరి రవికుమార్, లిఖిల్‌వర్మ, చేతన్‌వర్మ, నవీన్‌కుమార్, ఉదయ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ దేవదాసు, సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్ ఏర్పాట్లు పరిశీలించారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో కొండమీదరాయుని బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. గురువారం రాత్రి స్వామివారిని గరుడాద్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గరుడ వాహనంపై ఊరేగించారు. పుర వీధులలో ఊరేగుతూ స్వామి వారు భక్తులను కటాక్షించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శుక్రవారం రాత్రి శ్రీవారిని శ్వేత గజ వాహనంపై ఊరేగించనున్నారు.

ఎస్కేయూకు మహర్దశ

- 'పీఎం– ఉష' పథకం కింద రూ.20 కోట్ల నిధుల కేటాయింపు
- వర్సిటీ అభివృద్ధికి, ఉన్నతికి దోహదం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రగతి పథంలో దూసుకెళ్తోంది. నాణ్యమైన పరిశోధనలు, అధునాతన భవనాల నిర్మాణానికి వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దన్నుగా నిలుస్తున్నాయి. తాజాగా ప్రధాన మంత్రి ఉచ్ఛతార్ శిక్షా అభియాన్ (పీఎం – ఉష) పథకం కింద రూ. 20 కోట్ల నిధులు విడుదలకు ఆమోదం దక్కింది. ఈ మేరకు ఎస్కేయూతో పాటు రాష్ట్రంలోని మరో మూడు వర్సిటీలకు పీఎం – ఉష నిధులు మంజూరుకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి అనుమతులు జారీ చేసింది.

మౌలిక సదుపాయాల కల్పనకు దోహదం

రాష్ట్రీయ ఉచ్ఛతార్ శిక్షా అభియాన్ (రూసా) పథకాన్ని 2013లో ప్రారంభించగా, రెండో దశ కింద 2018లో పునరుద్ధరించారు. ప్రస్తుతం నూతన జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి రూసా పథకంలో పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు చేసి పీఎం – ఉష పేరుతో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ పథకం కింద మంజూరైన నిధులను ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలు పెంపొందించడం, ఉన్నత విద్యలో అడ్మిషన్ల పెంపుదల, నాణ్యమైన పరిశోధనలు, వర్సిటీ క్యాంపస్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం వంటి అంశాలకు వెచ్చించాల్సి ఉంది. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి గతంలో రూ.20 కోట్ల నిధులు విడుదల కాగా, వీటి వ్యయానికి సంబంధించిన వినియోగిత పత్రాలు (యుటిలైజేషన్ సర్టిఫికెట్స్)ను సమర్పించారు. దీంతో తాజాగా రూ.20 కోట్ల నిధుల విడుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నెల 17న అంగీకారం తెలిపాయి. ఈ నిధులతో వర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు మార్గం సుగమమైంది.



ఎస్కేయూ ప్రధాన ద్వారం

భువన విజయానికి నూతన శోభ

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఆడిటోరియం (భువన విజయం)కు నూతన శోభ రానుంది. భువన విజయం ఆధునీకరణ, పరీక్షల భవనానికి కంప్యూటర్లు, యూనివర్సిటీ శబరి అతిథి గృహం మరమ్మతులకు కలిపి రూ. 4 కోట్లు వెచ్చించేలా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నూతన కేంద్ర పరిశోధన సంస్థ భవనం, ఇందులో మొదటి అంతస్తులో పోటీ పరీక్షల కేంద్రానికి కేటాయించారు. లాన్, విన్ సర్వర్ రూం కలిపి రూ. 5.75 కోట్లు, అకడమిక్ అండ్ రీసెర్చ్ కొలాబిరేషన్, ఎంఓయూ విత్ ఇండస్ట్రీ, అల్యూమ్ని కనెక్ట్ పోర్టల్, యూజీసీ నిబంధనల మేరకు పరిశ్రమల అభివృద్ధి కేంద్రం, ఆన్‌లైన్ పోర్టల్ ఫర్ స్టూడెంట్ కేంద్రానికి రూ.8.50 కోట్లు మొత్తం రూ.20 కోట్లు వెచ్చించనున్నారు.

ఉన్నత విద్యామండలికి ధన్యవాదాలు



శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీగా బాధ్యతలు చేపట్టిన నెల రోజుల్లోనే రూ. 20 కోట్ల నిధులు మంజూరుకు అంగీకారం తెలపడం చాలా ఆనందంగా ఉంది. రాష్ట్రంలో నాలుగు వర్సిటీల్లో ఒకటిగా ఎస్కేయూను గుర్తించి పీఎం– ఉష పథకానికి ఎంపిక చేసిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ కె.హేమచంద్రారెడ్డి, పీఎం–ఉష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పోలా భాస్కర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. వర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు, నూతన పరిశోధన కేంద్రం నిర్మాణానికి నిధులు వెచ్చించనున్నాం.

– ప్రొఫెసర్ కె.హుస్సేన్‌రెడ్డి, వీసీ, ఎస్కేయూ

క్లుప్తంగా

ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు తిప్పేస్వామి

కణేకల్లు: స్థానిక రామనగర్ వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం టి.వీరాపురం గ్రామానికి చెందిన తిప్పేస్వామి (38) గురువారం మధ్యాహ్నం 43 ఉడేగోళంలో ఉన్న తన అక్క గోవిందమ్మను పలకరించి, అల్లుడు అంజేష్‌ను వెంటబెట్టుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. కణేకల్లులోని రామనగర్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో తిప్పేస్వామి తలకు బలమైన గాయాలయ్యాయి. స్వల్ప గాయాలతో అంజేష్ బయటపడ్డాడు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే కణేకల్లులోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక తిప్పేస్వామి మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'బర్డ్‌ఫ్లూ'పై అప్రమత్తత అవసరం

ఉరవకొండ: బర్డ్ ఫ్లూ వ్యాధిపై అప్రమత్తత ఎంతో అవసరమని పశుసంవర్ధక శాఖ ఉరవకొండ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేసులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ... ఉరవకొండ డివిజన్ పరిధిలోని పౌల్ట్రీ పరిశ్రమల్లో 2.91 లక్షల కోళ్లు ఉన్నాయన్నారు. అలాగే 3.9 లక్షల పెరటి కోళ్లను రైతులు పెంచుతున్నారన్నారు. నెల్లూరు జిల్లాలో ఇటీవల బర్డ్‌ఫ్లూ వ్యాధితో కోళ్లు మృతి చెంది సంఘటన దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ వ్యాధి కోళ్లకే కాకుండా ఇతర పక్షులకూ వ్యాపిస్తుందన్నారు. వ్యాధి సోకిన కోళ్లలో దగ్గు, జలుబు, ఆయాసం, దాణా సరిగా తినక రెట్టలు పలుచగా వేస్తాయన్నారు. వ్యాధి సోకిన కోళ్లలో మరణాల శాతం ఎక్కవగా ఉంటుందన్నారు. కోడి మాంసం, గుడ్డు ఎక్కవుగా ఉడికించి తినడం వల్ల వ్యాధి మనషులకు సోకకుండా ఉంటుందన్నారు. బర్డ్‌ఫ్లూ వ్యాధికి మందు లేదని నివారణ ఒక్కటే మార్గమని సూచించారు. ఈ వ్యాధి లక్షణాలు కన్పిస్తే వెంటనే పశువైద్యాధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పర్యావరణ విద్య పరీక్ష నేడు

అనంతపురం ఎడ్యుకేషన్: మార్చిలో జరిగే ఇంటర్ పబ్లిక్ పరీక్షలు రాసేందుకు ఫీజు చెల్లించిన జనరల్, ఒకేషనల్ గ్రూపులకు సంబంధించిన మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 'పర్యావరణ విద్య' పరీక్ష ఉంటుంది. ఈ మేరకు ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ ఎం.వెంకటరమణనాయక్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులతో పాటు ఇంటర్ చదివి 'పర్యావరణ విద్య' పరీక్షలో ఫెయిల్ అయినా లేదా హాజరు కాని విద్యార్థులు కూడా ఈ పరీక్షకు తప్పనిసరిగా హాజరుకావాలి. ఈ పరీక్షలో ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు ఇంటర్మీడియట్ బోర్డు నుంచి పాస్ సర్టిఫికేట్ జారీ చేయబడదు. ప్రశ్నపత్రాలను httpr://qp.apbie.org.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాళ్లకు సూచించారు.

వైఎస్సార్ సీపీ 'గుంతకల్లు' ఎన్నికల పరిశీలకుడిగా భీమిరెడ్డి

సాక్షి ప్రతినిధి అనంతపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు వైఎస్సార్ సీపీ చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకులను నియమిస్తూ వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గుంతకల్లు ఎన్నికల పరిశీలకుడిగా వై.భీమిరెడ్డి, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా వలివేడు రాజారెడ్డి (పృథ్వీ)ని నియమించారు.

వీరభద్రుని సేవలో తెలంగాణ మాజీ సీఎస్



సోమేష్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

లేపాక్షి: తెలంగాణ మాజీ చీఫ్ సెక్రటరీ, అప్పటి అనంతపురం జిల్లా కలెక్టర్ సోమేష్‌కుమార్ దంపతులు గురువారం సాయంత్రం లేపాక్షి ఆలయంలోని వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ వారికి ఘన స్వాగతం పలికారు. లేపాక్షి, పెనుకొండ తహసీల్దార్లు బాల నరసింహులు, ఉదయశంకర్, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు

కోటంకలో రేపు రథోత్సవం

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి రథోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రథోత్సవానికి జిల్లా నలుమూలాల నుంచి కాక ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కానున్న నేపథ్యంలో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాత్రి 8 గంటలకు రథోత్సవం ప్రారంభం కానుంది.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

గుత్తి: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి ఓ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. గుత్తి జీఆర్‌పీ పరిధిలోని తిమ్మాపురం సమీపంలో గురువారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న గుత్తి జీఆర్‌పీ ఎస్ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడికి 60 నుంచి 65 సంవత్సరాల మధ్య వయసుంటుందని నిర్ధారించారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని మృతదేహం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మిస్సింగ్ కేసుల్లో సంబంధీకులు ఎవరైనా ఉంటే గుత్తి రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఆరోగ్యశ్రీ పథకంపై అవగాహన కల్పించండి

- జెడ్పీ సీఈఓ నిదియాదేవి

అనంతపురం రూరల్: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని, ఇందులో భాగంగా పటిష్టంగా అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకంపై ప్రజలను చైతన్యపరచాలని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను జెడ్పీ సీఈఓ నిదియాదేవి ఆదేశించారు. గురువారం అనంతపురం రూరల్ పంచాయతీలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులతో సమావేశమై మాట్లాడారు. విధుల నిర్వహణలో చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజలతో సఖ్యతగా మెలుగుతూ అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలను రూ.25 లక్షల వరకు విస్తరించిన అంశంపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న సీఈఓ నిదియాదేవి

పాల సేకరణ ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి

రాప్తాడు: జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా పాల సేకరణకు పూర్తి స్థాయిలో సహకరించాలని డ్వాక్రా సంఘం సభ్యులకు జెడ్పీ సీఈఓ నిదియాదేవి సూచించారు. గురువారం రాప్తాడులోని గ్రామ సచివాలయంలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమంపై ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. పాలకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. ధర సమాచారాన్ని పాడి రైతుల మొబైల్‌కు ఎప్పటికప్పుడు సమాచారం అందజేస్తామన్నారు. 15 రోజులకోసారి పాడి రైతులకు బిల్లులు నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయన్నారు. గ్రామాల్లోని మహిళా పాడి రైతులు అధిక సంఖ్యలో లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతావాణి, ఏపీఎం నల్లప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ లాంఛనాలతో ఎస్ఐ వెంకటరమణ అంత్యక్రియలు



అనంతపురంలో వెంకటరమణకు నివాళులర్పిస్తున్న ఎస్పీ అన్బురాజన్



ఎస్ఐ అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి

అనంతపురం/గార్లదిన్నె: అనంతపురం నగరానికి చెందిన ఎస్ఐ నంబూరి వెంకటరమణ(55) అంత్యక్రియలు గురువారం గార్లదిన్నె మండలంలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. నంద్యాల జిల్లా ప్యాపిలి సర్కిల్ పరిధిలోని రాచర్ల ఎస్ఐగా పనిచేస్తున్న ఆయన... బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అన్నాసాగర్ వద్ద 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఆయనతో పాటు అల్లుడు పవన్ సాయి, డ్రైవర్ చంద్రశేఖర్ మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం సాయంత్రం ఎస్ఐ వెంకటరమణ మృతదేహాన్ని కుటుంబసభ్యులు గార్లదిన్నె మండలం మర్తాడులో తమ వ్యవసాయ క్షేత్రానికి తీసుకువచ్చారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, నంద్యాల ఎస్పీ రఘువీరారెడ్డి, డీఎస్పీ వెంకటశివారెడ్డి పాల్గొన్నారు. వెంకటరమణ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని రామచంద్ర నగర్‌లో ఉన్న స్వగృహానికి చేరిన వెంకటరమణ మృతదేహాన్ని ఎస్పీ అన్బురాజన్, పోలీసు ఉన్నతాధికారులు, సహచరులు సందర్శించి అశ్రునయనాలతో నివాళులర్పించారు. పీటీసీ అదనపు ఎస్పీ జె.మల్లికార్జున వర్మ, అనంతపురం డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి, పలువురు సీఐలు, ఎస్ఐలు, బ్యాచ్‌మేట్లు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొమ్మ విరిగిపడి ద్విచక్ర వాహన చోదకుడి మృతి





మృతుడు వెంకట్రాముడు, కొమ్మ పడడంతో నుజ్జయిన ద్విచక్ర వాహనం

నార్పల: చెట్టు కొమ్మ విరిగి పడడంతో ఓ ద్విచక్ర వాహన చోదకుడు మృతి చెందాడు. ఆయన భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన వెంకట్రాముడు(45), నాగమణి దంపతులు గురువారం ఉదయం పనిపై నార్పల మండలం గూగూడులోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుకు వచ్చారు. పని ముగించుకున్న అనంతరం స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా నడింపల్లి శివారులోకి చేరుకోగానే రహదారి పక్కన ఉన్న వేప చెట్టు కొమ్మ విరిగి ద్విచక్ర వాహనంపై పడింది. ఘటనలో వెంకట్రాముడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్ప గాయాలతో బయటపడిన నాగమణిని స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'కేఎస్ఎన్' డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల ఇటీవల నిర్వహించిన బీఏ, బీకాం, బీఎస్సీ ఆనర్స్ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్కేయూ వీసీ డాక్టర్ హుస్సేన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదాను కల్పిస్తూ గత ఏడాది మే లో యూజీసీ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం ద్వారా మేజర్, మైనర్ సబ్జెక్టులకు కళాశాల పరిధిలో గత డిసెంబరు, జనవరి నెలల్లో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించారన్నారు. మొత్తం 483 మంది విద్యార్థినులకు గాను 380 మంది ఉత్తీర్ణత సాధించినట్లుగా తెలిపారు. బీఏ ఆనర్స్‌లో 48 శాతం, బీకాం ఆనర్స్‌లో 86.47 శాతం, బీఎస్సీ ఆనర్స్‌లో 86.80 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శంకరయ్య తెలిపారు. ఫలితాలను www.ksngdcwexams.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీరంగయ్య, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ (సీఈ) డాక్టర్ శివశంకర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పర్వీన్‌భాను పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్కేయూ వీసీ డాక్టర్ హుస్సేన్‌రెడ్డి

తల్లి మృతి... దిక్కుతోచని స్థితిలో అంధ కుమారులు



రంగమ్మ(ఫైల్) అంధులైన కుమారులతో తండ్రి భీమారెడ్డి

బొమ్మనహాళ్: తల్లి మృతి చెందడంతో అంధులైన ఇద్దరు కుమారులు దిక్కుతోచని స్థితిలో మిగిలారు. బొమ్మనహాళ్ మండలం గోనేహాళ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన భీమారెడ్డి, వడ్డే రంగమ్మకు వన్నూరుస్వామి, రంగన్న అనే ఇద్దరు కుమారులు అంధులుగా పుట్టారు. రెండు రోజుల క్రితం జ్వరం బారిన పడిన రంగమ్మ (47)ను బళ్లారిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక గురువారం తెల్లవారుజామున ఆమె మృతి చెందింది. అంధులైన కుమారులకు అండగా ఉన్న తల్లి మృతి చెందడంతో వారి అవసరాలన్నీ తండ్రి భీమారెడ్డి మాత్రమే చూసుకోవాల్సి రావడంతో కుటుంబపోషణ భారమవుతుందని గ్రామస్తులు తెలిపారు. తల్లి మృతితో కుమారులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

గుత్తిలో అగ్ని ప్రమాదం

- దగ్ధమైన గుజరీ, సెలూన్ షాపు



గుజరీ షాపులో కాలిపోయిన నగదు


గుత్తి: స్థానిక తాడిపత్రి రోడ్డులోని ప్రజా వైద్యశాల సమీపంలో గురువారం తెల్లవారుజామున 4.30గంటలకు అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు గుజరీ షాప్‌నకు నిప్పు పెట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి పక్కనే ఉన్న సెలూన్ షాప్‌నకూ వ్యాపించాయి. సమాచారం అందుకున్న గుజరీ దుకాణం నిర్వాహకురాలు రాములమ్మ, సెలూన్ షాపు నిర్వాహకుడు వెంకటేష్ అక్కడకు చేరుకుని స్థానికుల సాయంతో మంటలు ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. గుజరీలోని విలువైన వస్తువులతో పాటు రూ.75 వేల నగదు కాలిపోయింది. ఈ రెండు దుకాణాల్లోనూ దాదాపు రూ.4 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గ్రూప్-2 పరీక్షకు సర్వం సిద్ధం

అనంతపురం అర్బన్: జిల్లావ్యాప్తంగా ఈ నెల 25న జరగనున్న గ్రూప్–2 పరీక్షకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 111 కేంద్రాల్లో జరగనున్న పరీక్షకు 32,391 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 25వ తేదీ వరకూ అందుబాటులో ఉంటుందన్నారు. ఏదేని సమాచారం లేదా ఫిర్యాదు చేసేందుకు అభ్యర్థులు 08554–220009 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. పరీక్ష సమయం కంటే గంట ముందుగానే అభ్యర్థులు కేంద్రానికి చేరుకోవాలన్నారు. హాల్ టికెట్‌తో పాటు ఏదేని ధ్రువీకరణ పత్రం (ఆధార్, పాస్‌పోర్ట్, ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, తదితర) వెంట తెచ్చుకోవాలన్నారు. కేంద్రంలోకి ఎలాంటి ఎల్రక్టానిక్ వస్తువులను అనుమతించమని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఔను.. బాబుకు రెస్ట్ ఇవ్వాల్సిందే

- నారా భువనేశ్వరి వ్యాఖ్యలతో ఏకీభవించిన రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



అనంతపురం ఎడ్యుకేషన్: నారా భువనేశ్వరి చెప్పినట్లుగా చంద్రబాబుకు రెస్ట్ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు జ్ఞాపకశక్తి పూర్తిగా తగ్గిపోయి భవిష్యత్తులో విధానపరమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం లోపిస్తున్నట్లుగా నారా భువనేశ్వరి గుర్తించి కుప్పం బరిలో తానే నిలుస్తున్నట్లుగా పేర్కొనడంపై ఆయన స్పందించారు. తన భర్తను 35 ఏళ్లుగా ఆదరించారని ఈసారి ఆయనకు రెస్ట్ ఇచ్చి తాను బరిలో నిలవాలని అనుకుంటున్నట్లుగా తన మనసులోమాటను ఆమె బహిర్గతం చేసిందన్నారు. లేదంటే ఎన్టీఆర్ కుటుంబానికి చెందిన పార్టీని నారా కుటుంబం లాగేసుకుందనే బాధ ఆమెలోనూ నెలకొని ఆ పార్టీ బాధ్యతలు తీసుకోవాలనే ఆలోచన కూడా అయిండొచ్చన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో గొప్ప పరిపాలన సాగుతోందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా పేదల ఖాతాల్లో రూ.2.55 లక్షల కోట్లు నేరుగా జమ చేశారన్నారు. 22 లక్షల ఇళ్లు మంజూరు చేశారన్నారు. 30 లక్షల ఇంటి పట్టాలు ఇచ్చారన్నారు. ఇంత మేలు చేశారు కాబట్టే కుప్పం స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేసిందన్నారు. చంద్రబాబు 30 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉండికూడా ఆ నియోజకవర్గం అభివృద్ధి చెందిందేమీ లేదన్నారు. 30 వేలమంది పక్కనే ఉన్న తమిళనాడుకు ఉపాధి కోసం వెళ్తున్నారన్నారు. 30 వేలమంది తమిళుల ఓట్లను చంద్రబాబు ఎక్కించుకున్నట్లు అధికారుల పరిశీలనలో తేలిందన్నారు. ఈ పరిస్థితుల్లో ఆ నియోజకవర్గంలో గెలవడం అసాధ్యం అనే విషయం చంద్రబాబు దంపతులిద్దరికీ తెలుసన్నారు. దీంతో ఎన్టీఆర్ కూతురిగా తనకేమైనా అవకాశం ఇస్తారేమోనని భువనేశ్వరి ఆశపడుతోందన్నారు. ఇప్పటికే తెలంగాణ అసెంబ్లీలో టీడీపీ జీరో అయిందన్నారు. తాజాగా రాజ్యసభలో జీరో అయిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో 175 స్థానాలూ వైఎస్సార్‌సీపీ గెలవబోతోంది కాబట్టి ఇక్కడి అసెంబ్లీలోనూ జీరో అవుతుందన్నారు. ఇక లోక్‌సభ స్థానాలను క్లీన్‌స్వీప్ చేయనుండడంతో అక్కడ కూడా టీడీపీ జీరో అవుతుందన్నారు. మొత్తం మీద టీడీపీ పెద్ద గుండుసున్నాగా మారి బీజేపీలో విలీనం అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు.

పోక్సో కేసు నమోదు

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావికి చెందిన వడ్డే మహేష్, మరో ఇద్దరిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. కొన్ని రోజులుగా తనను ప్రేమించాలని జె.వెంకటంపల్లికి చెందిన మైనర్ బాలిక వెంటపడి వేధించడంతో పాటు సెల్‌ఫోన్‌లో తరచూ మెసేజ్‌లు పంపుతూ ఒత్తిడి చేస్తుండేవాడు. ఈ క్రమంలో అతని వేధింపులు తారస్థాయికి చేరుకోవడంతో తల్లిదండ్రులకు తెలిపింది. అంతటితో ఆగకుండా గ్రామానికి చెందిన రామాంజినమ్మ ఇంటికి తరుచూ మహేష్ వెళుతూ బాలిక వెంటపడి వేధించేవాడు. గమనించిన బాలిక తల్లిదండ్రులు పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించినా అతనిలో మార్పు రాలేదు. దీంతో విసుగు చెందిన బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేష్, అతనికి సహకరించిన రామాంజినమ్మ, ఆమె తమ్ముడు మంజుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి దుర్మరణం



శ్రీనివాసులు (ఫైల్)

బుక్కరాయసముద్రం: మండలంలోని బొమ్మలాటపల్లి సమీపంలో సంజీవపురం గ్రామం క్రాస్ వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... నార్పలకు చెందిన శ్రీనివాసులు (52), తన భార్య ఉమామహేశ్వరితో కలసి గురువారం సాయంత్రం అనంతపురంలో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. సంజీవపురం క్రాస్ వద్దకు చేరుకోగానే నార్పల నుంచి అనంతపురానికి వెళుతున్న ఆటో ఢీకొంది. ఘటనలో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. ఉమామహేశ్వరి చెయ్యి విరిగి, తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే ఆమెను అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై బీకేఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

మౌనగిరి క్షేత్రంలో పూజలు



మహాలక్ష్మి యాగం నిర్వహిస్తున్న దృశ్యం

రాప్తాడు: మండలంలోని హంపాపురం సమీపంలోని మౌనగిరిక్షేత్రంలో వెలసిన 39 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు ఈశ్వరయ్య స్వామి ఆధ్వర్యంలో 39 అడుగుల అభయాంజనేయ స్వామికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే ఆలయంలో మృత్యుంజయ, నవగ్రహ, సహస్ర కమలాలతో మహాలక్ష్మి యాగాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ హోమం 3 రోజుల పాటు జరుగుతుందని.. శనివారం మాఘ పౌర్ణమి రోజున పూర్ణాహుతి కార్యక్రమంతో మహాయజ్ఞం ముగుస్తుందన్నారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా వైపీ బాబు



వైపీ బాబును అభినందిస్తున్న జిల్లా పాస్టర్లు

అనంతపురం కల్చరల్: వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా వైపీ బాబు నియామకంపై జిల్లా పాస్టర్లు హర్షం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నెహెమ్యా నాగరాజు ఆధ్వర్యంలో వైపీ బాబును అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్ నేతృత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. వైపీ బాబు రెండుసార్లు కౌన్సిలర్‌గా పని చేయడమే కాకుండా నిత్యం ప్రజల సమస్యలను తెలుసుకునే నాయకుడని కొనియాడారు.

గ్రంథాలయ సభ్యత్వ నమోదు పెంచాలి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ

ఆత్మకూరు: గ్రంథాలయ సభ్యత్వ నమోదు పెంచాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ సూచించారు. గురువారం ఆత్మకూరులోని గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ సభ్యత్వ నమోదు పెంచాలన్నారు. గ్రంథాలయ సెస్సు వసూలుకు కృషి చేయాలన్నారు. గ్రంథాలయ సెస్సు గురించి సంబంధించిన పంచాయతీ అధికారులతో మాట్లాడాలని తెలిపారు. గ్రంథాలయ సెస్సు సకాలంలో కట్టాలని తెలిపారు. కార్యక్రమంలో మండల గ్రంథాలయ అధికారి నల్లమ్మ పాల్గొన్నారు.

నాగరాజుకు డాక్టరేట్



అనంతపురం: ఎస్కేయూ కెమిస్ట్రీ విభాగంలో పరిశోధన చేసిన ఎస్.నాగరాజుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. 'సింథసిస్, క్యారక్టరైజేషన్, యాంటిక్సిడెంట్ అండ్ యాంటి మైక్రోబియాల్ స్టడీస్ ఆఫ్ లాంథనైడ్ కాంప్లెక్సెస్ విత్ నావల్ ట్రిడింటేట్ లైజెండ్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌ను ప్రచురించారు. కెమిస్ట్రీ విభాగంలో పీహెచ్‌డీ అడ్మిషన్ తీసుకున్న ప్రొఫెసర్ ఇబ్బందులకు గురి చేయడంతో కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.వెంకటరమణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.అనిత, టీచింగ్ అసిస్టెంట్ డాక్టర్ పి.సంజీవులు, ఇతర ప్రొఫెసర్ల సహకారంతో సెల్ఫ్ సబ్మిషన్ చేసుకుని అవార్డు అందుకున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

అనంతపురం సిటీ: వెంచర్ కాంట్రాక్టర్లు, బిల్డర్ల తీరుకు నిరసనగా గురువారం కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 5 వేల మంది గ్రానైట్ టైల్స్‌పై ఆధారపడ్డారని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, నగర కార్యదర్శులు ముర్తుజా, వెంకట్‌నారాయణ తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను పిలిపించుకోవడంతో ఉపాధి లేకుండాపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక శాఖ అధికారులు జోక్యం చేసుకుని జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి, సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీనరసయ్యకు అందించారు. త్వరలోనే జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని లక్ష్మీనరసయ్య హామీ ఇచ్చారు.

చంద్రబాబువి కుట్ర రాజకీయాలు

- అభివృద్ధికి అడ్డుపడితే ప్రజలే బుద్ధి చెబుతారు
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం రూరల్: వృద్ధురాలికి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం కార్పొరేషన్: ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులు

అనంతపురం రూరల్: రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. ఇది ఓర్చుకోలేని పచ్చ పార్టీ నాయకులు, ఎల్లో మీడియా ప్రతినిధులు ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. గురువారం రాజీవ్‌కాలనీ పంచాయతీలో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిపై అడిగి తెలుసుకున్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఎందుకు ఓటు వేయాలో ప్రజలకు వివరించారు. దొంగ హామీలు గుప్పించి అధికారంలోకి రాగానే ప్రజలను నిలువునా మోసం చేయడం చంద్రబాబుకు అలవాటే అన్నారు. అధికారం కోసం ఎన్ని అబద్ధాలు చెప్పడానికైనా చంద్రబాబు వెనకాడరని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు నియోజకవర్గంలో ఎక్కడ అభివృద్ధి చేశారో చూపించాలని సవాల్ విసిరారు. చిత్తశుద్ధి ఉంటే అధికారంలో ఉండగా చేసిన అభివృద్ధిని ప్రజలకు చూపించాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలను బురిడి కొట్టించడానికి టీడీపీ, జనసేన నాయకులు బయలుదేరారని ఎద్దేవా చేశారు. సంక్షేమ కోసం పాటుపడుతున్న వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఎల్లో మీడియా విషపు రాతలు దారుణం

రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం పరుగులు పెడుతుంటే ఎల్లో మీడియా ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకుని విషపురాతలు రాయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. పత్రికలు ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాల్సి ఉండగా ఎల్లో మీడియా మాత్రం చంద్రబాబును అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేయడం దుర్మార్గమన్నారు. జరిగిన అభివృద్ధిని చూపించి ఇంకా చేయాల్సిన అభివృద్ధిపై వార్తలు ప్రచురిస్తే ప్రతి ఒక్కరూ స్వాగతిస్తారని తెలిపారు. అలా కాకుండా కొన్ని పార్టీలకు వత్తాసు పలకుతూ వార్తలు ప్రచురించడం చూస్తుంటే ఎల్లో మీడియా ఎంతగా దిగజారిపోయిందో అర్థమవుతుందన్నారు. నగరంలో తాగునీటి సమస్య ఉందని కొన్ని పత్రికల్లో వార్తలు రావడం హాస్యాస్పదమన్నారు. మోటార్లు కాలిపోవడంతో ఒకటి, రెండు రోజుల అక్కడక్కడ నీటి సమస్య ఏర్పడిందన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించినా ఎల్లో మీడియా తప్పుడు రాతలు రాయడం చూస్తేంటే సిగ్గేస్తుందన్నారు.

ఆరు నెలల్లో బ్రిడ్జి నిర్మాణ పనుల పూర్తి

నారాయణపురం పంచాయతీ పరిధిలోని తడకలేరు వంకపై నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి భూమిపూజ చేశారు. నగరానికి దీటుగా పంచాయతీలను అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో దాదాపు రూ.100 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే అనంతపురం నగరం నుంచి రాజీవ్‌కాలనీ వచ్చే తడకలేరు వంకపై బ్రిడ్జి నిర్మాణంతో పాటు ప్రియాంకనగర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. నారాయణపురం పంచాయతీ పరిధిలో తడకలేరు వంకపై రూ.4.80 కోట్ల నిధులతో నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేసి ప్రజల చిరకాల కల సాకారం చేస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, రాజీవ్‌కాలనీ సర్పంచ్ ఆశాబీ, ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీటీసీలు, శృతి, నాగేంద్ర, మహబూబీ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, రూరల్ మండల జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, రూరల్ క్లస్టర్ ఇన్‌చార్జ్ హుస్సేన్, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెల వేణుగోపాల్, అంజి, రహీమ్, రాయల్ మనోజ్, జగన్‌మోహన్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి మీరే సాక్ష్యం

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే రానున్న రోజుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వం చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకుందామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నవోదయ కాలనీలో సాకే మురళి, దాదా ఫరూక్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో యువత వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యువకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రూ.2 వేలకు పైగా సంక్షేమం, రూ.1,045 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. గతంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని చెప్పామని.. కానీ కోవిడ్‌తో రెండేళ్లు గడిచిపోవడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో జాప్యం జరిగిందన్నారు. సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వస్తుందని తెలిపారు. నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి చేయబోతున్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని యువతకు సూచించారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో 34 లక్షలు మాత్రమే పింఛన్లు ఇచ్చేవారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో 66 లక్షలకు పైగా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 29,700 మందికి పింఛన్లు ఇవ్వడం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇస్తే.. అనంతపురం



నారాయణపురంలో బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే అనంత, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

నియోజకవర్గంలో 23 వేల మందికి ఇళ్ల పట్టాలను అందించడం జరిగిందన్నారు. ఇంకా నియోజకవర్గంలో 4,200 మంది ఇళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేయించారని.. వారికి త్వరలో ఇళ్ల పట్టాలను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, కార్పొరేటర్లు సంపంగి రామాంజనేయులు, ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే చిరంజీవి, జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధు, నాయకులు గంగాధర్, దివాన్, జీరావ్, నాగేంద్రరావు, గుజ్జల నారాయణ, రామచంద్ర, దాసరి గోవిందు, సంగమేష్, సాకే మణికంఠ, మహేష్‌రెడ్డి, చరణ్ పాల్గొన్నారు.

తాగునీటికి ధోకా లేదు

నగరానికి ఎలాంటి తాగునీటి ఇబ్బందులు లేవని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. సమీప భవిష్యత్‌లోనూ ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. ఎల్లో మీడియా విష ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని సూచించారు. ప్రస్తుతం పీఏబీఆర్ డ్యామ్‌లో 1.73 టీఎంసీల నీటి నిల్వ ఉందని, దీనివల్ల అనంతపురం నగరానికి ఎలాంటి నీటి సమస్య ఉండదన్నారు. నగరానికి నీటిని సరఫరా చేసే రెండు మోటర్లు అకస్మాత్తుగా చెడిపోవడంతోనే నీటి సరఫరాలో జాప్యం జరిగిందన్నారు. దీంతో చాలా ప్రాంతాలకు ట్యాంకుల ద్వారా నీటిని అందించేలా అధికారులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఆ తర్వాత తాను, నగరపాలక సంస్థ పాలకవర్గం బెంగళూరుకు మోటర్లను పంపించి మరమ్మత్తు చేయించామన్నారు. ప్రస్తుతం నగరంలో 80 నుంచి 85 శాతం నీటి సరఫరా జరుగుతోందని, మరో మోటర్ మరమ్మతు పూర్తయితే నీటి సరఫరా యథాస్థితికి చేరుకుంటుందన్నారు. భవిష్యత్తులోనూ మోటర్ల సమస్య తలెత్తకుండా రూ.1.80 కోట్ల వ్యయంతో మరో నూతన మోటర్‌ను కొనుగోలుకు నగరపాలక సంస్థ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారని ఎమ్మెల్యే అనంత వెల్లడించారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

రాప్తాడు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పర్యటిస్తారని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎం.చెర్లోపల్లిలో నూతన గ్రామ సచివాలయ ప్రారంభం, 11:45 గంటలకు జి.కొత్తపల్లిలో నూతన గోడౌన్ ప్రారంభిస్తారన్నారు. మధ్యాహ్నం 12:30 గంటలకు గాండ్లపర్తి గ్రామంలో సచివాలయ ప్రారంభం, 1:15 గంటలకు పాలచెర్ల గ్రామంలో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

బంగారు గొలుసు చోరీ

అనంతపురం: నగరంలోని రెండో రోడ్డులో నివాసం ఉంటున్న ఆదినారాయణమ్మ అనే వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు చోరీకి గురైంది. గురువారం మధ్యాహ్నం భోజనం చేసి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆదినారాయణమ్మను బుర్ఖా ధరించిన ఓ అగంతకుడు పలకరించాడు. మాటలు కలిపి ఆదినారాయణమ్మ మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లాడు. బుర్ఖా ధరించి వచ్చిన అగంతకుడి వివరాలను సేకరించి పనిలో నిమగ్నమైనట్లు త్రీ టౌన్ సీఐ ధరణి కిశోర్ పేర్కొన్నారు.

ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం అండ



కారుణ్య నియామక పత్రాన్ని అందజేస్తున్న మేయర్ వసీం, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని మేయర్ వసీం పేర్కొన్నారు. కొన్ని నెలల క్రితం దస్తగిరి అనే ఔట్‌సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మికుడు మృతి చెందాడు. గురువారం నగరపాలక సంస్థలో దస్తగిరి కుటుంబ సభ్యులకు మేయర్ వసీం కారుణ్య నియామక పత్రాన్ని అందజేశారు. కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు అబూసలేహా, దుర్గాదేవి, కమల్‌భూషణ్, నాయకులు మధు, శుకేష్, రామచంద్ర, ఈఈ సూర్యనారాయణ, కార్మిక సంఘం నాగభూషణం, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు 'ఉయ్యాలవాడ'



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం టవర్‌క్లాక్: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప ధీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అన్నారు. నరసింహారెడ్డి చరిత్రను ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విగ్రహ ఏర్పాటుకు సహకరించిన వారికి ఉయ్యాలవాడ జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, బయపరెడ్డి, కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, హనుమంతరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి, నితిన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని జనసంఘ్ కార్యాలయంలో గురువారం స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసంఘ్ జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కసిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి రొద్దం సురేష్ రెడ్డి, ఈసీ సభ్యులు దుబ్బ కిషోర్ రెడ్డి, తోపుదుర్తి రామకృష్ణా రెడ్డి, యనమల సత్యనారాయణ రెడ్డి, నాగిరెడ్డి పల్లి శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సోమప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ

కనగానపల్లి: మండలంలోని పాతపాళ్యంలో గురువారం సోమప్ప స్వామి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్టించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు వీరికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. సోమప్ప స్వామి కాపుల ఆధ్వర్యంలో రూ.కోటి పైగా వెచ్చించి నిర్మించిన ఈ ఆలయానికి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి విరాళం అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఆలస్యంగా నీటి సరఫరా

అనంతపురం కార్పొరేషన్: నగరంలో శుక్రవారం ఆలస్యంగా నీటి సరఫరా జరుగుతుందని నగరపాలక సంస్థ ఎస్ఈ రామమోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి హంసపల్లి వద్ద పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడటంతో మరమ్మతులు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయానికి బదులు సాయంత్రం నీటి సరఫరా అవుతుందన్నారు. అలాగే సాయంత్రం వేళ సరఫరా చేసే ప్రాంతాలకు శనివారం ఉదయం నీటి సరఫరా చేస్తామన్నారు.

డీటీల బదిలీపై ఈసీ స్పష్టత

అనంతపురం అర్బన్: డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలపై ఎన్నికల కమిషన్ స్పష్టతనిచ్చింది. అసిస్టెంట ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులుగా (ఏఈఆర్ఓ) వ్యవహరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్లను మరో మండలానికి బదిలీ చేయాలని పేర్కొంది. ఈ సూచనల మేరకు జిల్లాల కలెక్టర్లకు సీసీఎల్ఏ సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలతో నేరుగా సంబంధం ఉన్న డీటీలను బదిలీ చేయాలంటూ ప్రభుత్వానికి ఎన్నికల కమిషన్ సూచిస్తూ నాలుగు రోజుల కిత్రం ఉత్తర్వులిచ్చింది. అయితే ఈ విషయంలో ప్రభుత్వ అభ్యర్థన మేరకు స్పష్టతనివ్వడంతో డీటీల బదిలీపై నెలకొన్న సందిగ్ధత వీడింది. కాగా, జిల్లాలో ఏఈఆర్ఓలుగా డీటీలను నియమించలేదు కాబట్టి ఇక్కడ బదిలీలకు ఆస్కారం లేదని తెలుస్తోంది.

మార్కెట్‌లోకి 'హ్యార్లీ డేవిడ్ సన్'



ద్విచక్ర వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: ప్రముఖ హ్యార్లీ డేవిడ్ సన్ ద్విచక్ర వాహన కంపెనీ మొదటి సారిగా అనంతలో అడుగుపెట్టింది. హీరో మోటో కార్ప్, హార్లీ డేవిడ్సన్ సంయుక్తంగా నూతంగా హార్లీ డేవిడ్సన్ ఎక్స్440 వాహనాలను మార్కెట్‌లోకి విడుదల చేశారు. గురువారం జాతీయ రహదారిలో ఓ హోటల్‌లో లాంచింగ్ కార్యక్రమం నిర్వహించారు. తొలి కస్టమర్లకు వాహనాలను అందించి అభినందించారు. వాహనం ఎక్స్ షోరూం ధర రూ.2,39,500 నిర్ణయించినట్లు వివరించారు. కార్యక్రమంలో నరసింహా హీరో ఎండీ సునీల్‌రెడ్డి, హీరో మోటో కార్ప్ ఏఎస్ఎం దీపక్, టీఎస్ఓ హనుమా, నరసింహా హీరో జీఎం రాకేష్, సిబ్బంది, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు



కనగానపల్లి: వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ



రామగిరి: వలంటీర్లకు వందనం కార్యక్రమానికి హాజరైన గ్రామ వలంటీర్లు

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ

కనగానపల్లి/రామగిరి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకూ వెళ్లి అందిస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. గురువారం కనగానపల్లి, రామగిరి మండల కేంద్రాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల వద్ద వలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయ, వర్గ విభేదాలు లేకుండా పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. వృద్ధులకు అందించే పింఛన్ల నుంచి ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు అందించేలా వలంటీర్లు పని చేస్తున్నారన్నారు. కరోనా కష్ట సమయాల్లో వలంటీర్లు చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు.

వైఎస్సార్‌సీపీతోనే సామాజిక న్యాయం

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరిగిందని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తెలిపారు. కానీ టీడీపీ నాయకులు వెనుకబడిన, బలహీన వర్గాల ప్రజలతో ఓట్లు వేయించుకుని పెత్తందార్ల పాలన సాగించారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో పరిటాల కుటుంబ సభ్యులు బీసీ, ఎస్సీ వర్గాలను అడ్డం పెట్టుకుని ఫ్యాక్షన్ రాజకీయాలు నడిపి పదవులు పొందారన్నారు. అయితే వారు ఏనాడు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మేలు చేసింది లేదన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాప్తాడు నియోజకర్గంలో జరిగిన సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో 80 శాతం పైగా పదవులను బీసీ, ఎస్సీ, ఎస్టీలకే కట్టబెట్టామన్నారు. వీటి గుర్తించకుండా పరిటాల సునీత తిరిగి తమపైనే విమర్శలు చేయటం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఇక గత 25 ఏళ్లలో పరిటాల కుటుంబ సభ్యులు చేయని అభివృద్ధి పనులను తాము ఐదేళ్ల చేసి చూపించామన్నారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి వలంటీర్లను ప్రత్యేకంగా సన్మానించి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కనగానపల్లి ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, రామగిరి ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ నాగార్జున, కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, పలువురు మండల స్థాయి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు ఆత్మకూరులో 'వలంటీర్లకు వందనం'

ఆత్మకూరు: స్థానిక కనకదాస కల్యాణ మండపంలో శుక్రవారం గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా పురస్కారాల ప్రదానోత్సవం ఉంటుందని ఎంపీడీఓ దశరథ రామయ్య, ఎంపీపీ హేమలత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలకు సేవలందించిన గ్రామ వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందన్నారు. మండలంలోని గ్రామ వలంటీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కేంద్రంలో నిరంకుశ పాలన



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

అనంతపురం అర్బన్: కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోందని రైతు సంఘం నాయకులు ధ్వజమెత్తారు. రైతు ఉద్యమంపై పోలీసులతో దుర్మార్గంగా దాడి చేయించి రైతు శుభ్‌కరణ్‌సింగ్ బలితీసుకున్నారని మండిపడ్డారు. ఢిల్లీ రైతు ఉద్యమంపై దాడిని నిరసిస్తూ గురువారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద రైతు సంఘం నాయకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు ఢిల్లీలో రైతులు చేపట్టిన శాంతియుత ప్రదర్శనపై పోలీసులు సాగించిన దుర్మార్గపు దాడిలో రైతు ఉద్యమకారుడు శుభ్‌కరణ్‌సింగ్ మరణించాడన్నారు. రైతు ఉద్యమంపై మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గపు వైఖరికి ఇది నిదర్శమన్నామన్నారు. రైతు మృతికి కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటనారాయణ, బీహెచ్ రాయుడు, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, మసూద్‌వలి, పవన్, దిలీప్, ఇందిరమ్మ, కుళ్లాయమ్మ, నాగలక్ష్మి, ఈరమ్మ, అంజినమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్: రైతు ఉద్యమంపై బీజేపీ ప్రభుత్వం ధమనకాండకు పాల్పడిందంటూ రైతు సంఘం (సీపీఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున విమర్శించారు. రైతు శుభకరణ్ సింగ్ మృతిని పూర్తిగా కేంద్ర ప్రభుత్వ హత్యగా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ధమనకాండ నశించాలంటూ గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట రైతు సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నిరంకుశ విధానాలను అనుసరిస్తున్నారని విమర్శించారు. శాంతియుతంగా రైతులు చేస్తున్న ఉద్యమంపై పోలీసులు చేత దాడి చేయించడమే ఇందుకు నిదర్శమన్నారు. ఈ దాడిలో రైతు శుభకరణ్ సింగ్ మరణించారని.. ఇందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, వెంకటనారాయణ. నారాయణ స్వామి, బండిరామకృష్ణ, పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
23-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
535	162
73,158	22,217

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ		
నాస్‌డాక్	15,960	▲ 379
డోజోన్స్	38,878	▲ 265
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,684	▲ 22
డాక్స్	17,370	▲ 252
షాంఘై	2,988	▲ 37
నికాయ్	39,099	▲ 836

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,155	▽ 103
బంగారం (99.5 స్వచ్ఛత)	61,906	▽ 103
వెండి (కిలో)	70,396	▽ 312

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.51	83.53
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.62	106.16
€	యూరో	ఎస్‌బీఐ	88.61	90.97
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.76	56.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.58	55.50
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.41	64.01
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.22	22.79
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.96	23.49
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.42	12.49

మారుత్ డ్రోన్స్‌కు తొలి యుటిలిటీ పేటెంట్

డ్రోన్ల సాయంతో వరిసాగు

హైదరాబాద్: మారుత్ డ్రోన్స్ ప్రపంచంలోనే తొలి యుటిలిటీ పేటెంట్‌ను (మేథో సంపత్తి హక్కు) 20 ఏళ్ల కాలానికి సొంతం చేసుకుంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ వర్సిటీ (పీజేటీఎస్ఏయూ) సహకారంతో మారుత్ డ్రోన్స్ అభివృద్ధి చేసిన డైరెక్ట్ సీడింగ్ డ్రోన్‌కు ఈ పేటెంట్ దక్కింది. క్షేత్రస్థాయిలో వరిసాగు కోసం డైరెక్ట్ సీడింగ్ డ్రోన్లను విస్తృతంగా వినియోగించే దిశగా పనిచేయనున్నట్టు సంస్థ ప్రకటించింది. 2030 నాటికి మిలియన్ హెక్టార్లలో విత్తు నాటాలన్న లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకున్నట్లు మారుత్ డ్రోన్స్ వ్యవస్థాపకుడు, సీఈవో ప్రేమ్ కుమార్ విస్లావత్ తెలిపారు.



మూడేళ్లలో రూ. 10 వేల కోట్ల ఆదాయం

డెకరేటివ్ పెయింట్స్ వ్యాపారంలోకి ఆదిత్య బిర్లా గ్రూప్



న్యూఢిల్లీ: కొత్త వెంచర్ అయిన డెకరేటివ్ పెయింట్స్ వ్యాపార విభాగం నుంచి వచ్చే మూడేళ్లలో రూ. 10,000 కోట్ల ఆదాయాన్ని అంచనా వేస్తున్నట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా తెలిపారు. అప్పటికల్లా లాభాల్లోకి మళ్లగలమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బిర్లా ఓపస్ బ్రాండ్ కింద డెకరేటివ్ పెయింట్ల వ్యాపారంతో పాటు మూడు పెయింట్ ప్లాంట్లను గురువారం ఆయన ప్రారంభించారు. పానిపట్ (హరియాణ), లూధియానా (పంజాబ్), చెయ్యార్ (తమిళనాడు)లో ఈ ప్లాంట్లు ఉన్నాయి. బిర్లా ఓపస్ పెయింట్లు మార్చి నుంచి పంజాబ్, హరియాణ, తమిళనాడులో లభ్యమవుతాయి. జూలై నుంచి 1 లక్షకు పైగా జనాభా ఉన్న పట్టణాల్లో ఇవి లభిస్తాయని బిర్లా చెప్పారు. ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి 6,000 పట్టణాలకు కార్యకలాపాలు విస్తరించాలని నిర్దేశించుకున్నట్లు వివరించారు. గ్రూప్‌లో కీలకమైన గ్రాసిమ్ ఇండస్ట్రీస్ గతేడాది డెకరేటివ్ పెయింట్ల వ్యాపారంలోకి అడుగు పెడుతున్నట్లు ప్రకటించింది. 2025 నాటికి రూ. 10,000 కోట్లతో దేశీయంగా ఆరు తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే రూ. 5,000 కోట్లు వెచ్చించినట్లు బిర్లా ఓపస్ బిజినెస్ హెడ్ హిమాంశు కపానియా తాజాగా చెప్పారు. దేశీయంగా డెకరేటివ్ పెయింట్స్ మార్కెట్ దాదాపు రూ. 80,000 కోట్ల స్థాయిలో ఉంది. ఏషియన్ పెయింట్స్, బర్జర్ పెయింట్స్, నెరోలాక్, అక్జో నోవెల్ (డ్యూలక్స్) ఈ విభాగంలో దిగ్గజాలుగా ఉన్నాయి.

వొడా ఐడియా నిధుల బాట

- ఈ నెల 27న బోర్డు సమావేశం
- కంపెనీ బలిమికి కట్టుబాటు
- కుమార మంగళం బిర్లా వెల్లడి

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం దిగ్గజం వొడాఫోన్ ఐడియా నిధుల సమీకరణకు ప్రతిపాదించింది. ఈ అంశంపై చర్చించేందుకు కంపెనీ బోర్డు ఈ నెల 27న సమావేశం కానున్నట్లు కంపెనీ పేర్కొంది. నిధుల సమీకరణకున్న అన్ని అవకాశాలను బోర్డు పరిశీలించనున్నట్లు తెలియజేసింది. రైట్స్, పబ్లిక్ ఆఫర్, ప్రిఫరెన్షియల్ కేటాయింపులు, క్విప్ తదితర మార్గాలతోపాటు.. ఒకేసారి లేదా దశలవారీగా నిధుల సమీకరణకు తెరతీసే అంశంపై నిర్ణయించనున్నట్లు వివరించింది. వెరసి ఈక్విటీ లేదా రుణ మార్గాలలో నిధుల సమీకరణ చేపట్టనున్నట్లు బీఎస్ఈకి వొడాఫోన్ ఐడియా తాజాగా వెల్లడించింది.



విదేశీ ఇన్వెస్టర్లకు చోటు

నగదు సవాళ్లను ఎదుర్కొంటున్న వొడాఫోన్ ఐడియా కంపెనీ బలిమికి కట్టుబడి ఉన్నట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమారమంగళం బిర్లా తాజాగా స్పష్టం చేశారు. బిర్లా గ్రూప్ డెకరేటివ్ పెయింట్ల బిజినెస్‌లోకి ప్రవేశిస్తున్న సందర్భంగా వొడాఫోన్‌లో విదేశీ ఇన్వెస్టర్లకు చోటు కల్పించేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు. అయితే బోర్డులో విదేశీ ఇన్వెస్టర్లు ఎప్పుడు ప్రవేశిస్తారన్న అంశంపై ఇప్పుడే చెప్పలేమన్నారు. ఇందుకు వ్యూహాత్మకంగా తగిన ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. వొడాఫోన్ ఐడియాలో ఆదిత్య బిర్లా గ్రూప్ సహప్రమోటర్‌గా ఉన్న సంగతి తెలిసిందే. కాగా.. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్)లో కంపెనీ రూ. 6,986 కోట్లకు నికర నష్టాన్ని తగ్గించుకుంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 7,990 కోట్ల నష్టం ప్రకటించింది. దాదాపు రూ. 756 కోట్ల అనూహ్య లాభాలు నష్టాలు తగ్గేందుకు సహకరించాయి. భారీ రుణ భారాన్ని మోస్తున్న వొడాఫోన్ ఐడియా మొబైల్ టెలికం రంగంలోని ప్రత్యర్థి సంస్థలు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌నుంచి తీవ్ర పోటీని ఎదుర్కొంటోంది.

నిధుల సమీకరణ వార్తలతో వొడాఫోన్ ఐడియా షేరు బీఎస్ఈలో 6.3 శాతం జంప్‌చేసి రూ. 16.30 వద్ద ముగిసింది.

-542 నుంచి +535

కనిష్టాల నుంచి మార్కెట్ ర్యాలీ

- నాలుగో రోజు నిఫ్టీ సరికొత్త రికార్డు
- ట్రేడింగ్‌లో భారీ ఒడిదుడుకులు



ముంబై: మిడ్‌సెషన్ నుంచి ఆటో, ఐటీ, టెక్నాలజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు గురువారం కనిష్ట స్థాయిల నుంచి బౌన్స్ బ్యాక్ అయ్యాయి. యూరో జోన్ తయారీ, సేవా రంగ పీఎంఐ డేటా అంచనాలకు మించి నమోదవడంతో పాటు అమెరికా టెక్ కంపెనీల క్యూ3 ఆర్థిక ఫలితాలు మెప్పించడం దేశీయ ఈక్విటీ మార్కెట్ల రికవరీ ర్యాలీకి తోడ్పాటు అందించాయి. ఉదయం స్తబ్దుగా ట్రేడింగ్ ప్రారంభించిన సూచీలు రోజంతా తీవ్ర ఊగిసలాటకు లోనయ్యాయి. ఇంట్రాడేలో 542 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్ చివరికి 535 పాయింట్ల లాభంతో 73,158 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 1176 పాయింట్ల రేంజ్‌లో 72,081 వద్ద కనిష్టాన్ని, 73,256 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 180 పాయింట్ల నష్టం తేరుకొని 162 పాయింట్లు బలపడి 22,217 వద్ద స్థిరపడింది. ఒక దశలో 197 పాయింట్లు పెరిగి వరుసగా నాలుగోరోజూ 22,252 వద్ద జీవితకాల గరిష్టాన్ని లిఖించింది. ఈ సూచీకి ముగింపు(22,217)కూడా కొత్త రికార్డు కావడం విశేషం. ఆటో, ఐటీతో పాటు క్యాపిటల్ గూడ్స్, పారిశ్రామిక, విద్యుత్ రంగాల షేర్లు రాణించాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.92%, 0.54% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,410 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,824 కోట్ల షేర్లు కొన్నారు. ఆసియాలో ఇండోనేసియా మినహా అన్ని దేశాల స్టాక్ సూచీలు 2% వరకు ర్యాలీ చేశాయి. యూరప్‌లో ఫ్రాన్స్, జర్మనీ ఎక్చేంజీలు 1.50% లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు 2% లాభాల్లో ట్రేడవుతున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25) సీజన్‌లో చెరకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.25 మేర పెంచుతున్నట్లు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకోవడంతో చక్కెర ధరలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈలో రానా షుగర్స్, మవాన షుగర్స్, శ్రీ రేణుక షుగర్స్, దాల్మియా షుగర్స్, భరత్ షుగర్ అండ్ ఇండస్ట్రీస్, ఈఐడీ ప్యారీ షుగర్స్ షేర్లు 3% – 1% చొప్పున నష్టపోయాయి.

డాలర్ మారకంలో రూపాయి విలువ 11 పైసలు బలపడి 82.85 వద్ద స్థిరపడింది.

కొత్త చందాదారుల ఆకర్షణలో జియో టాప్

డిసెంబర్‌లో 40 లక్షల కస్టమర్లు • ఎయిర్‌టెల్‌లోకి 18.5 లక్షలు • 119 కోట్లకు టెలికం చందాదారులు



న్యూఢిల్లీ: కొత్త కస్టమర్లను ఆకర్షించడంలో మరోసారి రిలయన్స్ జియో ముందుంది. 2023 డిసెంబర్ నెలకు గాను 39.94 లక్షల మొబైల్ చందాదారులను జియో సొంతం చేసుకుంది. భారతీ ఎయిర్‌టెల్ కిందకు కొత్తగా 18.5 లక్షల మంది కస్టమర్లు వచ్చి చేరారు. అదే సమయంలో ఎప్పటి మాదిరే వొడాఫోన్ ఐడియా మరో 13.68 లక్షల కస్టమర్లను డిసెంబర్‌లో కోల్పోయింది. ప్రభుత్వరంగ బీఎస్ఎన్‌ఎల్ 1.5 లక్షల కస్టమర్లు, ఎంటీఎన్ఎల్ 4,420 మంది కస్టమర్ల చొప్పున నష్టపోయాయి. మొత్తం టెలికం చందాదారులు 2023 నవంబర్ నాటికి 1,185.73 మిలియన్లుగా ఉంటే, డిసెంబర్ చివరికి 1,190.33 మిలియన్లకు (119 కోట్లకు) చేరారు. నెలవారీగా ఇది 0.39 శాతం వృద్ధికి సమానం. బ్రాడ్‌బ్యాండ్ చందాదారులు సైతం 90.4 కోట్లకు పెరిగారు. వైర్‌లైన్ టెలిఫోన్ చందాదారుల సంఖ్య నవంబర్ చివరికి 3.15 కోట్లుగా ఉంటే, డిసెంబర్ చివరికి 3.18 కోట్లకు పెరిగింది. వైర్‌లైన్ విభాగంలో జియో 2.46 లక్షల కొత్త కస్టమర్లను సాధించింది. ఎయిర్‌టెల్ 82,317 మంది, వొడాఫోన్ ఐడియా 9,656, క్వాంటమ్ 6,926 కస్టమర్ల చొప్పున సొంతం చేసుకున్నాయి. బీఎస్ఎన్ఎల్ 34,250 మంది, టాటా టెలిసర్వీసెస్ 22,628 మంది చొప్పున కస్టమర్లను కోల్పోయాయి.

అశోక్ లేలాండ్ @ 30 లక్షలు



చెన్నై: హిందూజా గ్రూప్ కంపెనీ, వాణిజ్య వాహనాల తయారీలో ఉన్న అశోక్ లేలాండ్ సరికొత్త మైలురాయిని చేరుకుంది. ఉత్తరాఖండ్‌లోని పంత్‌నగర్ వద్ద ఉన్న కంపెనీ ప్లాంటు మొత్తం 30 లక్షల యూనిట్లను తయారు చేసి కొత్త రికార్డు సృష్టించింది. అత్యంత విశ్వసనీయ ఉత్పత్తులను తయారు చేయడంలో, అగ్రశ్రేణి కస్టమర్ సేవలను అందించడంలో సుస్థిర ఖ్యాతికి ఈ మైలురాయి నిదర్శనం అని అశోక్ లేలాండ్ ఎండీ, సీఈవో శేను అగర్వాల్ గురువారం తెలిపారు.

సి.ఎం.ఆర్. ప్రచారకర్తగా మృణాల్ ఠాకూర్

హైదరాబాద్: ప్రముఖ వస్త్ర స్వర్ణాభరణాల సంస్థ సి.ఎం.ఆర్.షాపింగ్ మాల్ నూతన బ్రాండ్ అంబాసిడర్‌గా సినీ నటి మృణాల్ ఠాకూర్ నియమితులయ్యారు. తెలుగువారి ప్రతి వేడుకలో భాగమైన సి.ఎం.ఆర్.కు ప్రచారకర్తగా ఎంపిక కావడం సంతోషంగా ఉందని మృణాల్ ఠాకూర్ ఈ సందర్భంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. శుభ కార్యాలకు ప్రత్యేక పట్టువస్త్రాలు, యువత మెచ్చే సరికొత్త ఫ్యాషన్స్, అద్భుతమైన డిజైన్లతో కిడ్స్ వేర్ కలెక్షన్స్ ఇక్కడ లభిస్తాయన్నారు. ''మృణాల్ ఠాకూర్ మా సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం సంతోషంగా ఉంది. ప్రపంచ స్థాయి ఫ్యాషన్ ట్రెండ్‌కు అనుగుణంగా ఎప్పటికప్పుడు సరికొత్త కలెక్షన్స్ మా వద్ద లభిస్తాయి'' అని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ తెలిపారు



కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

23-2-2024	
విశాఖ	525–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515–00
విజయవాడ	515–00
రిటైల్ ధర (డజను)	72.00
22-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	534–00
వరంగల్	536–00
రిటైల్ ధర	5.95

సాక్షి స్పోర్ట్స్



ఐపీఎల్ నుంచి షమీ అవుట్

భారత పేస్ బౌలర్ షమీ ఎడమ కాలి మడమ గాయం కారణంగా ఐపీఎల్–2024 సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. గత నెలలో లండన్‌లో ఈ గాయానికి చికిత్స తీసుకునే క్రమంలో మడమకు అతను ప్రత్యేక ఇంజక్షన్‌లు తీసుకున్నాడు. అయితే అవి ప్రభావం చూపించకపోవడంతో శస్త్ర చికిత్స చేయించుకోవడం తప్పనిసరిగా మారింది. త్వరలోనే అతను మళ్లీ లండన్‌కు వెళతాడు. వన్డే వరల్డ్ కప్‌లో 24 వికెట్లతో భారత్‌ను ఫైనల్ చేర్చడంలో కీలక పాత్ర పోషించిన షమీ ఆ తర్వాత మరే మ్యాచ్‌లోనూ బరిలోకి దిగలేదు.

నేటి నుంచి రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్

రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ ఎలైట్ డివిజన్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు శుక్రవారం మొదలుకానున్నాయి. ఇండోర్‌లో మధ్యప్రదేశ్‌తో ఆంధ్ర జట్టు... ముంబైలో బరోడాతో ముంబై జట్టు... నాగ్‌పూర్‌లో కర్ణాటకతో విదర్భ... కోయంబత్తూరులో తమిళనాడుతో డిఫెండింగ్ చాంపియన్ సౌరాష్ట్ర తలపడనున్నాయి.

చెన్నై X బెంగళూరు

మార్చి 22న ఐపీఎల్ మొదటి పోరు

- తొలి దశ షెడ్యూల్ విడుదల
- వైజాగ్‌లో రెండు ఢిల్లీ జట్టు మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) –2024కు అధికారికంగా నగారా మోగింది. మార్చి 22న జరిగే టోర్నీ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ తమ సొంతగడ్డపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుతో తలపడుతుంది. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీసీసీఐ రెండు దశల్లో ఐపీఎల్‌ను నిర్వహించాలని నిర్ణయించింది. అందుకే తొలి దశలో మార్చి 22 నుంచి ఏప్రిల్ 7 మధ్య జరిగే 21 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను మాత్రమే విడుదల చేసింది. లీగ్‌లో మొత్తం 74 మ్యాచ్‌లు జరుగుతాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత మిగిలిన 53 మ్యాచ్‌ల తేదీలు, వేదికలను బోర్డు ప్రకటిస్తుంది. గత రెండు సీజన్ల తరహాలోనే 10 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతీ టీమ్ లీగ్ దశలో 14 మ్యాచ్‌లు ఆడుతుంది. టోర్నీ ఫైనల్ మే 26న జరిగే అవకాశం ఉంది. తొలి 21 మ్యాచ్‌ల షెడ్యూల్‌లో నాలుగు తేదీల్లో ఒకేరోజు రెండు మ్యాచ్‌లు ఉన్నాయి. ఈ 17 రోజుల్లో ఢిల్లీ, గుజరాత్, బెంగళూరు గరిష్టంగా ఐదేసి మ్యాచ్‌ల చొప్పున ఆడతాయి.

అందుకే విశాఖలో...

ఆంధ్ర క్రికెట్ అభిమానులకు ఐదేళ్ల విరామం తర్వాత ఐపీఎల్ మ్యాచ్‌లు చూసే అవకాశం దక్కుతోంది. ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ తమ రెండు 'హోమ్' మ్యాచ్‌లను వైజాగ్‌లో ఆడాలని నిర్ణయించుకుంది. క్యాపిటల్స్ సొంత వేదిక ఫిరోజ్‌షా కోట్లా మైదానం మార్చి 17న జరిగే డబ్ల్యూపీఎల్ ఫైనల్ సహా మొత్తం 11 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తోంది. దాంతో ఐపీఎల్‌కు ముందు గ్రౌండ్ సన్నద్ధతకు తగినంత సమయం లభించడం లేదు. ఈ కారణంగా క్యాపిటల్స్ తమ వేదికను వైజాగ్‌కు మార్చింది. విశాఖలో వైఎస్ఆర్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియం ఇప్పటి వరకు 13 ఐపీఎల్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇచ్చింది. ఆఖరి సారిగా 2019 లీగ్‌లో ఎలిమినేటర్, క్వాలిఫయింగ్–2 మ్యాచ్‌లు ఇక్కడే జరిగాయి. మరోవైపు పంజాబ్ కింగ్స్ కూడా తమ హోమ్ వేదికను మార్చింది. ఇప్పటి వరకు మొహాలి ఈ టీమ్ సొంత గ్రౌండ్‌గా ఉండగా... చండీగఢ్ శివార్లలో ముల్లన్‌పూర్‌లో కొత్తగా నిర్మించిన స్టేడియంలో ఇకపై తమ హోమ్ మ్యాచ్‌లు ఆడుతుంది.



బెంగళూరు కెప్టెన్ డు ప్లెసిస్, చెన్నై కెప్టెన్ ధోని (ఫైల్)

ఐపీఎల్ తొలి దశ షెడ్యూల్

తేదీ	మ్యాచ్	వేదిక
మార్చి 22	చెన్నై X బెంగళూరు	చెన్నై
మార్చి 23	పంజాబ్ X ఢిల్లీ	చండీగఢ్
మార్చి 23	కోల్‌కతా X హైదరాబాద్	కోల్‌కతా
మార్చి 24	రాజస్తాన్ X లక్నో	జైపూర్
మార్చి 24	గుజరాత్ X ముంబై	అహ్మదాబాద్
మార్చి 25	బెంగళూరు X పంజాబ్	బెంగళూరు
మార్చి 26	చెన్నై X గుజరాత్	చెన్నై
మార్చి 27	హైదరాబాద్ X ముంబై	హైదరాబాద్
మార్చి 28	రాజస్తాన్ X ఢిల్లీ	జైపూర్
మార్చి 29	బెంగళూరు X కోల్‌కతా	బెంగళూరు
మార్చి 30	లక్నో X పంజాబ్	లక్నో
మార్చి 31	గుజరాత్ X హైదరాబాద్	అహ్మదాబాద్
మార్చి 31	ఢిల్లీ X చెన్నై	వైజాగ్
ఏప్రిల్ 1	ముంబై X రాజస్తాన్	ముంబై
ఏప్రిల్ 2	బెంగళూరు X లక్నో	బెంగళూరు
ఏప్రిల్ 3	ఢిల్లీ X కోల్‌కతా	వైజాగ్
ఏప్రిల్ 4	గుజరాత్ X పంజాబ్	అహ్మదాబాద్
ఏప్రిల్ 5	హైదరాబాద్ X చెన్నై	హైదరాబాద్
ఏప్రిల్ 6	రాజస్తాన్ X బెంగళూరు	జైపూర్
ఏప్రిల్ 7	ముంబై X ఢిల్లీ	ముంబై
ఏప్రిల్ 7	లక్నో X గుజరాత్	లక్నో

నోట్: తొలి మ్యాచ్ ఒక్కటే రాత్రి 8 గంటలకు ప్రారంభం కానుండగా... మిగతా రాత్రి మ్యాచ్‌లన్నీ గం.7:30 నుంచి... మధ్యాహ్నం మ్యాచ్‌లన్నీ గం. 3:30 నుంచి జరుగుతాయి.

సిరీస్ లక్ష్యంగా...

ఐదుటెస్టుల సిరీస్‌లో భారత్ మూడో టెస్టుతో పైచేయి సాధించింది. ఇప్పుడు రాంచీలో సిరీస్ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. రోహిత్ శర్మ బృందానికి ఇప్పుడు యువ ఆటగాళ్లే బలంగా మారారు. యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్ అవకాశాల్ని బాగా అందిపుచ్చుకున్నారు. ఇపుడు ఇదే బలగంతో ఒక మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను ఇక్కడే ముగించాలని టీమిండియా ఆశిస్తోంది.

- సమరోత్సాహంతో టీమిండియా
- నేటి నుంచి ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు
- ఒత్తిడిలో స్టోక్స్ బృందం
- ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం





రాంచీ: తొలి టెస్టులో ఇంగ్లండ్ చేతిలో అనూహ్యంగా ఓడిన భారత్ ఆ తర్వాత వరుసగా రెండు, మూడు టెస్టుల్లో గెలిచింది. రెండో టెస్టులో బుమ్రా పేస్, మూడో టెస్టులో జడేజా స్పిన్ కీలక భూమిక పోషిస్తే... ఈ రెండు టెస్టుల్లోనూ యువ సంచలనం యశస్వి డబుల్ సెంచరీలు కామన్‌గా కలిసొచ్చాయి. రోహిత్, గిల్‌లతో టాపార్డర్‌కు ఏ ఢోకా లేదు. మిడిలార్డరే అనుభవలేమితో ఉంది. రజత్ పటిదార్‌కు రెండు మ్యాచ్‌ల్లోనూ అవకాశమిచ్చినా ఏమాత్రం మెప్పించలేకపోయాడు. గత మ్యాచ్ ఆడిన సర్ఫరాజ్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ నిరూపించుకున్నాడు. జడేజా శతకం మిడిలార్డర్‌ను నిలబెట్టింది. బుమ్రా లేని పేస్ బౌలింగ్‌కు తొలిసారిగా సిరాజ్ పెద్దదిక్కయ్యాడు. ఇన్నాళ్లు షమీ, బుమ్రాలతో బంతిని పంచుకునే అతను రాంచీలో ప్రధాన పేసర్‌గా బరిలోకి దిగబోతున్నాడు. స్పిన్ వికెట్ కాబట్టి ముగ్గురు రెగ్యులర్ స్పిన్నర్లు బరిలోకి దిగడం ఖాయమనిపిస్తోంది. గురువారం నెట్స్‌లో ఆకాశ్‌దీప్ గంటల తరబడి శ్రమించాడు. ఒకవేళ సిరాజ్‌కు జోడీగా అతన్ని పరిశీలించవచ్చు.

సమం కోసం ఇంగ్లండ్ సమరం

ప్రస్తుత భారత్‌తో పోలిస్తే స్టోక్స్, రూట్, డకెట్, క్రాలీ, పోప్, అండర్సన్‌లతో కూడిన ఇంగ్లండే అనుభవజ్ఞులతో మేటిగా ఉంది. అయినాసరే సిరీస్‌లో భారత కుర్రాళ్ల జోరుకు క్లీం వేయలేక డీలా పడుతోంది. రాజ్‌కోట్‌లో అయితే మొదటి ఇన్నింగ్స్‌లో అదరగొట్టిన స్టోక్స్ సేన రెండో ఇన్నింగ్స్‌కు వచ్చేసరికి చేతులెత్తేసింది. రూట్, ఒలీ పోప్, బెయిర్‌స్టోల వైఫల్యం జట్టుకు ప్రతికూలంగా మారింది. చాన్నాళ్ల తర్వాత కెప్టెన్ స్టోక్స్ బౌలింగ్ వేసేందుకు నెట్స్‌లో ప్రాక్టీస్ చేశాడు. గతేడాది యాషెస్ సిరీస్ మధ్యలోనే మోకాలి గాయం వల్ల స్టోక్స్ పూర్తిగా బ్యాటింగ్‌కే పరిమితమయ్యాడు. గత జూన్ నుంచి బౌలింగ్‌కే దిగలేదు. ఇప్పుడు మాత్రం బంతిపట్టే యోచనలో పడ్డాడు. వరుస మ్యాచ్‌ల ఓటమిలతో ఇంగ్లండ్ తుది జట్టులో మార్పులు చేసింది. లెగ్ స్పిన్నర్ రేహన్ అహ్మద్ స్థానంలో ఆఫ్‌స్పిన్నర్ షోయబ్ బషీర్‌ను హార్ట్‌లీకి జోడీగా బరిలోకి దించుతోంది. మార్క్ వుడ్‌ను తప్పించి రాబిన్సన్‌ను తుది జట్టులోకి తీసుకున్నారు.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), జైస్వాల్, శుబ్‌మన్ గిల్, పటిదార్, సర్ఫరాజ్, ధ్రువ్ జురెల్, జడేజా, అశ్విన్, సిరాజ్, కుల్దీప్, ముకేశ్/ఆకాశ్‌దీప్.

ఇంగ్లండ్: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, ఒలీ పోప్, జో రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, హార్ట్‌లీ, బషీర్, రాబిన్సన్, అండర్సన్.



డబ్ల్యూపీఎల్ ట్రోఫీతో కెప్టెన్లు స్మృతి, బెత్ మూనీ, అలీసా హీలీ, మెగ్ లానింగ్, హర్మన్‌ప్రీత్

మహిళల లీగ్‌కు వేళాయెె...

నేటి నుంచి డబ్ల్యూపీఎల్	బరిలో 5 జట్లు, 22 మ్యాచ్‌లు	తొలి మ్యాచ్‌లో ముంబైతో ఢిల్లీ 'ఢీ'	మార్చి 17న ఫైనల్ పోరు

రాత్రి గం. 7:30 నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్‌కు రంగం సిద్ధమైంది. గత ఏడాది తొలి సీజన్‌లో అభిమానులను ఆకట్టుకొని పలువురు యువ క్రికెటర్లను వెలుగులోకి తెచ్చిన ఈ లీగ్ మరోసారి అదే స్థాయిలో ఆసక్తికరంగా సాగే అవకాశం ఉంది. నేడు చిన్నస్వామి స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌లో గత సీజన్ విజేత ముంబై ఇండియన్స్‌తో రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ తలపడుతుంది. మిగతా మూడు జట్లు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్ కూడా ఈసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. గత ఏడాదిలాగే ఈసారి కూడా టోర్నీలో మొత్తం 22 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మార్చి 17న ఢిల్లీ వేదికగా ఫైనల్ జరుగుతుంది.

తాజా సీజన్ విశేషాలు....

- గత సీజన్‌లో ఒక్క ముంబైలోనే అన్ని మ్యాచ్‌లు జరిగాయి. ఈసారి బెంగళూరు, ఢిల్లీలను వేదికలుగా ఎంపిక చేశారు.
- తొలి సీజన్‌లాగే పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లు 'ఎలిమినేటర్' మ్యాచ్‌లో తలపడతాయి.
- గత ఏడాది ఐదు టీమ్‌లకు కెప్టెన్లుగా వ్యవహరించిన వారే ఈసారి సారథులుగా ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయిన మెగ్ లానింగ్ (ఢిల్లీ), అలీసా హీలీ (యూపీ), బెత్ మూనీ (గుజరాత్) ఆస్ట్రేలియన్లే కాగా...హర్మన్‌ప్రీత్ (ముంబై), స్మృతి మంధాన (బెంగళూరు) భారత స్టార్లు. భారత్ మినహా ఆసీస్ నుంచే గరిష్టంగా 13 మంది ప్లేయర్లు బరిలోకి దిగుతున్నారు.
- 2023 సీజన్‌లో సత్తా చాటిన సైకా ఇషాక్, శ్రేయాంక పాటిల్ ఆ తర్వాత భారత జట్టుకు ఎంపికయ్యారు. గత ఏడాది వీరిని కనీస ధర రూ.10 లక్షలకు తీసుకోగా... రెండు సీజన్ల మధ్య భారత జట్టుకు ఆడటంతో బీసీసీఐ నిబంధనల ప్రకారం వీరిద్దరికి రూ. 30 లక్షల చొప్పున లభిస్తాయి.
- ఈ సీజన్ వేలంలో కాశ్వీ గౌతమ్‌ను రూ.2 కోట్లకు గుజరాత్ జెయింట్స్ టీమ్ ఎంచుకుంది. అయితే గాయం కారణంగా ఆమె ఈ సీజన్ నుంచి అనూహ్యంగా తప్పుకోవడం గమనార్హం.
- హైదరాబాద్, ఆంధ్ర జట్ల నుంచి 8 మంది ఈసారి డబ్ల్యూపీఎల్‌లో బరిలోకి దిగనున్నారు. హైదరాబాద్ ప్లేయర్లు అరుంధతి రెడ్డి (ఢిల్లీ), త్రిష పూజిత (గుజరాత్), యషశ్రీ, గౌహర్ సుల్తానా (యూపీ) జట్లకు... ఆంధ్ర క్రికెటర్లు స్నేహ దీప్తి (ఢిల్లీ), సబ్బినేని మేఘన (బెంగళూరు), షబ్నమ్ (గుజరాత్), అంజలి శర్వాణి (యూపీ) టీమ్‌ల తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు.